నాటిక

# ఉచిత శిక్ష

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

భర్త: చిన్నారి గుబ్బెళ్లు జీరాడు పాదాలు
నన్నేడిపిస్తాయి నామీదుగా నడచి
నన్నొంటిగా చేసి పోకే జవరాల!
నేనొంటిగా బ్రతుకలేనె.

(మెల్లిగా మొదలెట్టి-బిగ్గరగా పాడి ముగిస్తాడు)

భార్య: ఎందుకండీ అట్లా పాడతారు?

భర్త: నీకిష్టంలేదా?

భార్య: నే ననలేదే!

భర్త: ఐతే పాడమంటావా?

భార్య: వద్దు.

భర్త: సరే పాడతానులే.

భార్య: పోనీ పాడండి- వింటాను.

భర్త: అదేవిటి మళ్లీ.

భార్య: నేను పాడమంటున్నాను.

భర్త: ఇందాక...

భార్య: ఇందాక వద్దన్నాను.

భర్త: ఇప్పుడు...

భార్య: ఇప్పుడు ఆజ్ఞాపిస్తున్నాను!

భర్త: శిరసావహిస్తున్నా!

భార్య: (మొగం చాటు చేసి నవ్వుకుంటుంది.)

భర్త: నిన్న మొన్నటి పూలు
నన్నుగని నవ్వాయి
నన్నేమొ నీకన్న
సన్నగా చూశాయి-
నన్నొంటిగా చేసి పోకే ..

భార్య: ఆగండి. ఎవర్నడిగి వ్రాశారు?

భర్త: ఎవర్నడగాలి?

భార్య: నన్ను యీ జవరాల్ని.

(ప్రీతితో నన్ను, చూపిస్తుంది.)

భర్త: నిన్నెందుకు మన్నా.

భార్య: ఆ జవరాల్ని నేను కానా?

భర్త: ఎవరైనా కావొచ్చు.

భార్య: ఐతే, ఆవియోగంమాత్రంమీదికాబోలు

భర్త: అది కూడా నన్నంటదు

భార్య: ఐతే మీరెవరు?

భర్త: కవిని.

భార్య: కాదు, ఋషి.

భర్త: రెండూను.

భార్య: పాడండి. ఇంకావింటాను.

భర్త: నన్ను గని ముడిచేటి
కన్నె బాలిక సోకసు
కన్ను మూసితె చాలు
కండ్లకింపుగ వాలు!
నన్నొంటిగా జేసిపోకె-జవరాల
నేనొంటిగా బ్రతుకలేనె!

భార్య: ఎప్పుడండీ యిది వ్రాసింది?

భర్త: నిన్ను పెండ్లాడకముందు.

భార్య: నామీదేనా-చెప్పండి?

భర్త: నీకు మతిలేదు.

భార్య: మీ కెట్లా తెలుసు?

భర్త: హుష్. ఆగు. ఎవరో వస్తున్నారు.

భార్య: ఐతే, నేను నిద్రనటిస్తాను.

(ప్రవేశం: రవి, ప్రభ-చేతిలో దీపంతో-)

రవి: ఎవరో యింకా మేలుకొన్నారిక్కడ.

ప్రభ: ఎవరైయుంటారు? (దీపం ఎత్తి చూస్తుంది.)

రవి: ఇప్పుడే పాటకూడా వినిపించింది.

ప్రభ: ఆచార్యులా- విద్యార్థులా?

రవి: ఏమో. సాంకేతికం కనుక్కో.

ప్రభ: (బిగ్గరగా) ఎవరా మేలుకొన్నది. సాంకేతికం చెప్పాలి?

భర్త: (లోపల్నుంచి) ఇప్పుడెట్లా, మర్చిపోయాను.

(బిగ్గరగా) కా... కా... కాళిదాసు.

ప్రభ: కాదు. బయటికి రావాలి.

భర్త: వస్తున్నా...

రవి: సాంకేతికం?

భర్త: శ్రీహర్షుడు- సరేనా.

ప్రభ: (గుర్తించి) అయ్యో రవీ! ఆచార్యులే-

రవి: అయ్యా! యీ తప్పు క్షమించాలి.

ఆచార్యులు: విద్యార్థుల విడుదులు పరిశీలించారా?

రవి: అందరూ సుషుప్తిలో వున్నారు.

ఆచార్యులు: సాంకేతికం అడిగారా?

రవి: ఆ అందరూ పలికేరు.

ఆచార్యులు: నువ్వు ప్రభా!

ప్రభ: రెండుగదుల్లోంచిమాత్రం సమాధానం లేదు.

ఆచార్యులు: పరీక్షించ లేదా మరి.

ప్రభ: అనుజ్ఞ లేదు.

ఆచార్యులు: పదండి నేనూ వస్తున్నా.

ప్రభ: ఇటు, ఇటు- చిత్రశాల విద్యార్థుల విడిదిలో.

ఆచార్యులు: మనమిప్పుడే దారిని పోదాం?

రవి: నర్తనశాలమీదుగా.

ఆచార్యులు: సరేనడవండి, చిన్నా, తలుపేసుకో.

(భార్య గడియవేసినచప్పుడు టక్కుమని వినిపిస్తుంది.)

రవి: (నడుస్తూ ఆగి) ఆ మువ్వల ధ్వని ఎక్కడిది?

ప్రభ: (వినుట వభినయించి) ఎవరో సన్నగా మురళికూడా ఊదుతున్నారు.

ఆచార్యులు: అవును, అవును. వినపడుతోంది సన్నగా.

రవి: అదుగో మువ్వల రవళి.

ప్రభ: ఆవెనుక నిశ్శబ్దంలో పిల్లనగ్రోవి.

రవి: ఆనర్తకి అడుగులు గాలిమీదకూడా తేలిపోయేటంత చెమ్మదిగా పడుతున్నాయి.

ప్రభ: పిల్లనగ్రోవి మీదుగావచ్చిన పాట నిశ్శబ్దంలో మునిగిన మన స్వర్ణసీమను స్వర్గసీమగా చేస్తోంది.

రవి: ఎవరీ నాట్యకర్తె?

ప్రభ: ఎవరి దీపిల్లనగ్రోవి?

ఆచార్యులు: ఇక్కడ ఆగి తెలుసుకుందాం- నిశ్శబ్దంగా ఉండండి!

(ముగ్గురూ ఆగిపోతారు)

(లోనుంచి)

"ఇన్నాళ్లవలె గాదమ్మా! మన మువ్వ
గోపాలుడు, ఎన్ని నేర్చినాడమ్మా!"

(మురళిమీదుగా పాట- గజ్జల మోత వినిపించి కొంతసేపటికి ఆగిపోతాయి.)

పురుషస్వరం: నర్తకీ! నీవయోవిలాసానికి సముద్రుడు బాహువుల్ని జాచుకుని మరీ ఉప్పొంగుతున్నాడు.

నర్తకి: ఇదిగో సముద్రుడుకి-

తెనుగు పడుచులు తురిమి విడచిన
తెనుగుపూలివి అందుకోనుమోయ్.

(నవ్వుతుంది)

పు. స్వరం: ఏమి నీ కంత లోకువ?

నర్తకి: కాదు- అతనెంత మహారసికుడో—

పు. స్వరం: ఈ సీమలో అందరూ రసమయ జీవులే.

నర్తకి: ఎట్లా చెప్పగలిగేరు?

పు. స్వరం: నిన్నుబట్టి నిర్ణయించాను.

నర్తకి: నా నృత్యం అంతటి రసానుభూతి కలిగించిందా?

పు. స్వరం: నిస్సందేహంగా- ఇక్కడ తెల్గువారి రసమయ జీవితం క్షణక్షణానికి వివిధ రూపాలలో పరివర్తనాన్ని పొంది ఒక బ్రహ్మాండమైన కళాస్వరూపానికి అంకితం కాబోతోంది.

నర్తకి: ఓ... హో!

(పన్నెండు గంటలు వినిపిస్తాయి)

నర్తకి: (ఉలిక్కిపడి) అయ్యో! పన్నెండు దాటింది.

పు. స్వరం: నర్తనశాలనుంచి ఎవరికంటా పడకుండా పోలేమూ?

నర్తకి: మనకోసం యీపరికే వెతుకుతూ వుంటారు.

పు. స్వరం: సాంకేతికం గుర్తుందా?

నర్తకి: నిన్న 'కాళిదాసు' అనుకుంటా-

పు. స్వరం: ఈవేళ నిన్న కాదు. సాంకేతికం శ్రీహర్షుడు.

నర్తకి: ఇంక మర్చిపోను.

(నర్తనశాల వదలి యీవలకు వస్తారు)

"విశ్రాంతి... విశ్రాంతి... విశ్రాంతి"



(చెరో వైపునుంచి 'రవి, ప్రభ' విశ్రాంతి అంటూ వస్తారు.)

నర్తకి బాబోయ్! పరిచారికలు-

పు. స్వరం త్వరగా నడువు. భయంలేదు.

రవి, ప్రభ (రెండువైపుల్నించి వచ్చి) ఎవరు మీరు?

పు. స్వరం విద్యార్థులం ..

రవి నేటి సాంకేతికం?

పు. స్వరం శ్రీహర్షుడు-

రవి. జరుగుతున్న కాలం?

పు. స్వరం అర్థరాత్రి.

రవి: ఎక్కడనుంచి మీ రాక-

పు. స్వరం నర్తనశాల-

రవి· ప్రదర్శనాలు ప్రస్తుతం నిషేధించబడినవి కాదా?

పు. స్వరం అవును. అభ్యాసానికి నిషేధం లేదు.

రవి. ఏది. అనుజ్ఞాపత్రం-

పు. స్వరం మా .వ. .ద్ద లేదు!

రవి ప్రభా! ఆచార్యులతో మనవిచేసి రా, అనుజ్ఞాపత్రం లేదన్నారని.

నర్తకి· అమ్మయ్యో మమ్మల్ని, వదులు ..

రవి నేను మిమ్మల్ని పట్టుకోనలేదే—

నర్తకి మమ్మల్ని పోనియ్యి యీపట్టుకి.

రవి అది నావల్ల కాదు .

నర్తకి· నీకు దయలేదు.

రవి· నియమాల్ని ఉల్లంఘించిన వారిపట్ల దయ చూపటంకోసం గాదు నేను.

నర్తకి. మంచిది. నిన్ను వేడుకోవటం నాది బుద్ధి తక్కువ.

రవి: ఆచార్యులే పట్టియిమ్మన్నారు మిమ్మల్ని.

నర్తకి: అదుగో ప్రభ వస్తోంది-ఆచార్యులేమన్నారో ?

ప్రభ: ఈ జంటని తమ యెదుట ప్రవేశబెట్టమని కోరేరు.

రవి: ఇకనడవండి...నావెనుక——

(నలుగురూ ఆచార్యునికుటీరానికి చేరుకుంటారు)

ఆచార్యులు: చిన్నా! చిన్నా! ఒక్కమారు మెలకువ తెచ్చుకో.

చిన్నాదేవి: ఇదుగో వచ్చాను ..ఆజ్ఞాపించండి.

ఆచార్యులు: నీవే ఆజ్ఞాపించే సమయం వచ్చింది-యిక్కడ కూర్చుని అంతా వినవలసిందని ప్రార్థిస్తున్నా.

చిన్నాదేవి: మంచిది-ఆ వస్తూన్నదెవరు ?

ఆచార్యులు: దొరికి పోయిన జంట. (విద్యార్థుల వంకతిరిగి) ఏం దొరికి పోయారు, అవునా ?

(ఇద్దరూ అభివాదనం చేస్తారు)

ఆచార్యులు: అమ్మాయీ, యీతనెవరు ?

నర్తకి: స ..హా...పా...ఠి...

ఆచార్యులు: ఎందువల్ల మిమ్మురాత్రి విచారించవలసి వస్తున్నదో తెలుసునా ? ఏ నియమావళిని ఉల్లంఘించినందున మీకీ విచారణో తెలుసునా ?

(ఇద్దరూ తమకు తెలియవన్నట్లు తల అడ్డంగా వూపుతారు).

ఆచార్యులు: జీవితానికి శీలం కనకానికి హైలి వంటిది అవునా?

నర్తకి: అవును స్వామీ.

ఆచార్యులు: ఆ శీలాన్ని కళంకితం చేసుకోవటం-అపవాదుల పాలు చెయ్యటం తప్పు పని కాదూ?

పు. స్వరం: అటువంటి దేమీ మేము చూసి వుండలేదు.

ఆచార్యులు: పిల్లా, నీవు చెప్పు-నర్తన శాలలో వున్న మీమీద ఒక అపవాదు పడిందనుకో-కలుసుకోకుండా వుంటే ఏ అపవాదు లేకపోయేదేమో, అని అనుకుంటావా లేదా?

నర్తకి: తప్పకుండా అనుకుంటాను.

ఆచార్యులు: నీవోయ్-నువ్వు చెప్పు. అన్నట్లు నీ పేరు?

పు. స్వరం: అపవాదువలన శీలానికి కళంకం రాదు. నన్ను ఉమాపతి అంటారు.

ఆచార్యులు: ఉమాపతీ, నేరం బోధపడిందా? అనుజ్ఞ లేకుండా, విశ్రాంతి కాలంలో విద్యార్థులై యుండగా, నర్తనశాలలో సమాగమం జరిగింది. మీకు-సాక్షులుకూడా వున్నారు.

రవి: నేను నర్తనశాలనుంచి యీవలకు వస్తూంటటం చూశాను!

ప్రభ: మేమే ముద్దాయీలను పట్టుకొన్నాం.

నర్తకి: నేను చెప్పవలసినది లేదు - ఉమాపతి తప్పుకూడ నేనే బాధ్యురాలిని.

రవి: బాగు...బాగు.

ఆచార్యులు: చిన్నా! చిన్నా! యీ విచారణను ముగించి తీర్పు చెప్పే బాధ్యత నీకు వదుల్తున్నాను-నీవీయి రావాలి.

చిన్నాదేవి: వస్తున్నాను. (ముందుకు వచ్చి-) నాయనా! నీ మూలకంగా యీ బిడ్డకూడా శిక్షింపబడుతోంది.

ఉమాపతి: అవును తల్లీ! నాకదే దుఃఖకారణం.

చిన్నాదేవి: శిక్షించినందువలన నేరాలు జరగటం మానవు.

రవి: లేకపోతే యిటువంటి నేరాలు మితిమీరిపోతాయి.

చిన్నాదేవి: నాకు తెలుసు- శరీరానికి శిక్ష లేకపోవడం న్యాయశాస్త్రానికి విరుద్ధం!

ప్రభ: అమ్మా, చంద్రబింబం వంటి రాకాసి మబ్బు పాలయిపోతోంది. త్వరగా విచారణ ముగించాలి.

చిన్నాదేవి: ఒకరి దోషంవలన ఒకరు. ఇప్పుడు యిద్దరికీ పడుతోంది శిక్ష.

ఉమాపతి: దోషమంతా నాదే తల్లీ!

నర్తకి: నేనే మూలకారణాన్ని తల్లీ!

చిన్నాదేవి: వ్యవధికూడా లేదు- నీవిటురా అమ్మా!

(ఒకరికొకర్ని అభిముఖంగా నిలబెడుతుంది.)

ఒక్కమాట నాయనా,నర్తకి గళాన్ని ఈపసుపు కొమ్ముతో బాధించటంకన్న నీకు వేరే గత్యంతరం లేదు- అమ్మాయీ! నీ శరీరానికి యితడి బాహుబంధంలో నలిగి కృశించిపోవటంకన్న గత్యంతరం లేదు సుమా!

(నర్తకి, ఉమాపతి ఒకరిముఖంలోకి ఒకరు చూచుకుంటారు)

Source: Press Academy Website, Telugu Swatantra Magazine, Nov 1948

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Puranam Subrahmanya Sarma gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/